లోపించిన చి(చె)త్తశుద్ధి

- డంపింగ్‌యార్డులను తలపిస్తున్న రహదారులు
- కంపుకొడుతున్న డ్రెయినేజీలు
- అస్తవ్యస్తంగా పంచాయతీ నిర్వహణ
- రామయ్య కొలువైన భద్రాద్రిలో తీరిదీ..



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



కాలనీలో రోడ్డుపైనే పేరుకుపోయిన చెత్త

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమున్న భద్రాద్రిలో పారిశుద్ధ్య చర్యలు లోపించాయి. పరిసరాల పరిశుభ్రత, సంపూర్ణ పారిశుద్ధ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇచ్చినా క్షేత్రస్థాయిలో అధికారులకు చెత్తపై చిత్తశుద్ధి కరువైంది. దీంతో కాలనీలలో రోడ్ల పక్కనే కుప్పలుతెప్పలుగా చెత్త పేరుకుపోతోంది. పట్టణంలోని పలు కాలనీలలో ఇప్పటి సరైన డ్రెయినేజీ వ్యవస్థలేకపోవడంతో ఆయా కాలనీల మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు మాత్రం కొన్ని కాలనీలకు మాత్రమే చెత్త సేకరణకు వాహనాలను పంపి మరికొన్ని కాలనీలకు వారంలో ఒక్క రోజు మాత్రమే పంపిస్తున్నట్లు ఆయా కాలనీల వాసులు ఆరోపిస్తున్నారు. ఇంకా పట్టణ శివారు కాలనీ వాసుల పరిస్థితి మరింత దయనీయం. దీంతో చెత్తను పట్టణ శివారుకు తీసుకెళ్లి పడేయాల్సిన పరిస్థితి ఏర్పాడుతోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ..

పట్టణంలోని లంబాడీ కాలనీ, భగవాన్‌దాస్ కాలనీ, ఏఎస్‌ఆర్ కాలనీ, సుభాష్ నగర్ కాలనీ, జగదీస్ కాలనీ, కొత్త కాలనీ, రాజీవ్ నగర్ కాలనీ, ఏఎమ్‌సీ కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కొన్ని కాలనీల్లో ఒకవైపు డ్రెయినేజీ కాలువ ఉండగా మరో వైపు లేదు. మరి కొన్ని కాలనీలలో రెండు వైపుల డ్రెయినేజీ కాలువలు లేవు. దీంతో మురుగు నీరు రోడ్డుపై వచ్చి చేరుతోంది. వాహనదారులు, ప్రజలు ఈ రోడ్లపై నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలనీల్లో ముగరు నీరు రోజుల తరబడి డ్రెయినేజీ కాలువలోనే నిలువ ఉంటోంది. అందులోని చెత్తా చెదారాన్ని సిబ్బంది తొలగించకపోవడంతో కాలనీలన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయి. డ్రెయినేజీల్లోని మురుగునీరు నిలువ ఉండడం వల్ల పక్కనే ఉన్న మంచినీటి పంపులలోకి చేరి తాగునీరు సైతం కలుషితమవుతున్నాయి.

రోడ్లపైనే చెత్తాచెదారం

పంచాయతీ సిబ్బంది ఎవరో చెప్పిన్నట్లు కొన్ని కాలనీలకే పరిమితం అవుతున్నారు. దీంతో పలు కాలనీల్లోని ప్రజలు పంచాయతీ సిబ్బంది వచ్చి చెత్తను తరలిస్తారులే అనే ధీమాతో చెత్తను రోడ్ల పక్కన వేస్తున్నారు. రోజుల తరబడి పంచాయతీ సిబ్బంది ఆయా కాలనీల వైపు చూడకపోవడంతో చెత్త రోజు రోజుకూ పెరిగిపోతుంది. పందులు, కుక్కలను ఆ చెత్తను విచ్చినం చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దుర్వాసన వల్ల కాలనీ ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతూ తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీల్లోని మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంలో పాటు రోడ్లకు ఇరుపక్కల డ్రెయినేజీ కాలువలు నిర్మాణం చేయాలని, పంచాయితీ సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్, దోమల మందును పిచికారీ చేయించాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీలను శుభ్రం చేయించాలి

పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీలో డ్రెయినేజీ కాలువలల్లో చెత్తాచెదారం పేరుకుపోయి కాలువల పొడవునా దుర్వాసన వెదజల్లుతోంది. వర్షపు నీటితో పాటు డ్రెయినేజీలోని మురుగు నీరు ఇళ్ల ముందుకు వస్తోంది. పంచాయతీ అధికారులు డ్రెయినేజీలను శుభ్రం చేయించాలి.

– ప్రశాంత్, భగవాన్‌దాస్ కాలనీ

రోడ్డుపైనే మురుగు నీరు

మా కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్లలోని మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దుర్వాసనతో ముక్కులు మూసుకోవాల్సి పరిస్థితి. అధికారులు పూర్తి స్థాయిలో డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించాలి.

– శివ, లంబాడీ కాలనీ

చెత్త వాహనం రావడం లేదు

మా కాలనీలోని చెత్త తరలించేందుకు పంచాయతీ వాహనం రావడం లేదు. దీంతో ఇళ్లలోనే చెత్త పేరుకుపోతోంది. ఈ చెత్తను రోడ్డు మీద వేసే పరిస్థితి లేకపోవడంతో ఇంట్లో ఎక్కువ రోజులు నిలువ ఉండి దుర్వాసన వస్తుంది. చిన్న పిల్లలు ఈ దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– కొత్త భాస్కర్‌రావు, భూపతిరావు కాలనీ

క్లుప్తంగా

బడి పనులకు లైన్ క్లియర్

గుండాల: ఆళ్లపల్లి మండలం మర్కోడు పాఠశాలపై ఉన్న విద్యుత్ తీగలను ఎంపీపీ మంజు భార్గవి చొరవతో బుధవారం మార్చారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మర్కోడు పాఠశాల పనులకు విద్యుత్ తీగలు ఆటకంగా మారాయి. దీంతో ఎంపీపీ మంజు భార్గవి విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ స్తంభం మార్చి తీగలను తొలగించారు. పాఠశాల పనులు వెంటనే ప్రారంభించాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

పాఠ్యాంశంపై అవగాహన ఉండాలి

భద్రాచలంటౌన్: విద్యార్థులకు పాఠ్యాంశంపై ఎక్కువగా అవగాహన కలిగి ఉండాలని జగిత్యాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ.జ్యోతిలక్ష్మి తెలిపారు. భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు అకశేరుకాలు వైవిధ్యంపై అతిథి ఉపన్యాసాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, శ్యాంప్రసాద్, డాక్టర్ ఏ. శ్రీను, భవాని, పావని పాల్గొన్నారు.

వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి

మణుగూరురూరల్: బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ వాగ్దానాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని సింగరేణి సంస్థను అభివృద్ధి చేయని సీఎం కేసీఆర్.. ఆంధ్రాలోని స్టీల్ ఫ్యాక్టరీని కొనుగోలు చేయడానికి ప్రయత్నించడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక బీపీఎల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఎత్తివేయాలని, కమలాపురం పేపర్ బోర్డ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గురిజాల గోపి, పాపారావు, కిరణ్ మోహన్, మనోజ్, కిషన్ నాయక్ పాల్గొన్నారు.

ముస్లింల వినతి

అశ్వాపురం: బీఆర్‌ఎస్ పార్టీ ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌కే.నయీం ఆధ్వర్యంలో మండలంలోని ముస్లింలు మణుగూరులో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును బుధవారం కలిసి సమస్యలపై వినతిప్రతం అందజేశారు. మండలంలో ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఈద్గా, కబరస్థాన్‌కు నిధులు, స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే రేగాకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రేగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ బషీర్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ అజీజ్, గ్రామశాఖ అధ్యక్షుడు సయ్యద్ యాకూబ్ ఆలీ, నజీర్‌షాను, అబ్దుల్ ఆహ్మద్, అబ్దుల్‌బారి, భాషా, రంజాన్, ఆలీ అబ్దుల్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఓసీ–2 సందర్శనకు వచ్చిన ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు మణుగూరు ఏరియా ఈపీ ఆపరేటర్లు సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈపీ ఆపరేటర్లకు సంబంధించిన పదోన్నతులు చేపట్టాలని, సీ గ్రేడ్, బీ గ్రేడ్ ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏ గ్రేడ్, స్పెషల్ గ్రేడ్ ఆపరేటర్లకు పదోన్నతుల పత్రాలను వెంటనే అందజేయాలని వారు ఏరియా జీఎంను కోరారు. కార్యక్రమంలో పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్, ప్రాజెక్ట్ మేనేజర్ రాముడు, టీబీజీకేఎస్ నాయకులు ప్రభాకర్‌రావు, ఆపరేటర్లు ఎస్‌డి.నాసర్‌పాషా, సీహెచ్ అశోక్, ఎస్.కుమారస్వామి, జాన్ అబ్రహం, జగదీష్, శ్రీధర్, రవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం ఆర్టీసీ బస్టాండ్‌లో భద్రాచలం డిపో మేనేజర్ ఆదేశాలతో లక్ష్మీనగరం పంచాయతీ సిబ్బంది సహకారంతో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల దప్పిక తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఉప సర్పంచ్ గుడ్ల రామ్మోహన్‌రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది ఎం వి.రావు, ప్రయాణికులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని ప్రధాన సెంటర్‌లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉపసర్పంచ్ డి.బాబురావు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, ఎంపీఓ తోట తులసీరాం, సెక్రటరీ ఉపేందర్, సీహెచ్ రామరాజు, సూరా వెంకటేశ్వర్లు, యండి.అన్వర్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కరకగూడెం: బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నికైన షేక్ అన్వర్ ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు మంగళవారం రాత్రి ఆయన స్వగ్రామమైన కుర్నవల్లిలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. నాయకులు ప్రసాద్, హరికృష్ణ, సందీప్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై సర్వే



సమస్యలు తెలుసుకుంటున్న సీఐటీయూ నాయకులు

భద్రాచలంఅర్బన్: సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలోని అనేక కాలనీల్లో ఇంటింటికీ కార్యకర్తలు తిరుగుతూ సామాజిక అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తమ దృష్టికి వచ్చిన అంశాలపై సీఐటీయూ జిల్లా నాయకులు ఎంబి.నర్సారెడ్డి, యం.రేణుకలు మాట్లాడుతూ.. కోవిడ్ తర్వాత చాలామంది అసంఘటిత కార్మికులకు పనులు లేకుండాపోయిందని, చేతివత్తి చేసుకునే వాళ్లకు కూడా సరైన పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హులైన వారికి దళిత బంధు అందలేదని, చాలామంది డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. స్వయం ఉపాధి పనులు చేసుకుందామన్నా ఆర్థిక స్తోమత లేని పరిస్థితులు తమదృష్టికి వచ్చాయని తెలిపారు. ఈ సర్వేలో సీఐటీయూ నాయకులు సంతోష్, సతీశ్, అప్పారి రాము, మధు, చాట్ల శ్రీను, ఝాన్సి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా

గుండాల: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఉమ్మడి గుండాల మండలంలో పొంగులేటి వర్గీయులు, ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తునట్లు ప్రకటించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల నాయకులు ఎస్‌కె.ఖదీర్ మాట్లాడుతూ.. షోకజ్ నోటీసులు లేకుండా ఒక నియంత పాలనను తలపించేలా సస్పెన్షన్ ఉందని విమర్శించారు. పార్టీ నాయకుల గెలుపుకోసం ప్రధాన పాత్ర పోషించిన వ్యక్తి పొంగులేటి అని గుర్తు చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఉమ్మడి గుండాల మండలం నుంచి తమ మద్దతు ఉంటుందని, ఆయనతోనే తాము ఉంటామని తెలిపారు. రోళ్లగడ్డ, కాచనపల్లి ముత్తాపురం సర్పంచ్‌లు అజ్మీరా మోహన్, పోలెబోయిన సౌజన్య, పూనెం సమ్మయ్య, లింగగూడెం, ముత్తాపురం, దామరతోగు, రోళ్లగడ్డ పంచాయతీల ఉప సర్పంచ్‌లు కుంజ యశోద, మోకాళ్ల శంకర్, కొమరం రమేష్, మాలోత్ రాజు, మాజీ ఎంపీపీ చాట్ల పద్మ, మాజీ రైతు సమన్వయ కమిటీ సభ్యులు బాటయ్యతో పాటు, నాయకులు దారా అశోక్, కుంజ లక్ష్మయ్య, సుతారి చంటి, మోకాళ్ల చంద్రయ్య, వాజీద్, కిరణ్, జబ్బా లక్ష్మయ్య, బాబూరావు, పూకె బుచ్చయ్య, ఆళ్లపల్లి మండలం నుంచి పాయం సత్యనారాయణ, తెల్లం జనార్ధన్, చందా రాంబాబు, రఘుపతి, రాంమూర్తి, పాయం నర్సింహారావు, ఉల్లోజు భరత్, వాసం శ్రీకాంత్, కల్తి నాగేష్, వారభద్ర చారి, రడం శేఖర్, గొగ్గెల రవి కక్కెర్ల సునీతలు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.



గుండాలలో రాజీనామాను ప్రకటిస్తున్న పొంగులేటి వర్గీయులు

అధికారంలోకి రావడం ఖాయం



మొండికుంటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రంగాకిరణ్, నాయకులు

అశ్వాపురం: తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ మీడియా కోఆర్డినేటర్ కేవీ.రంగాకిరణ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెరుగు రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో పల్లె పల్లెకూ ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేవీ.రంగాకిరణ్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగారెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షుడు గోసుల రాములు, నాయకులు తాటి వెంకన్న, సురేష్, కొల్లు లింగారెడ్డి, వెంకట్‌రెడ్డి, చింతలచెరువు శ్రీనివాసరావు, గంధం నాగేంద్రప్రసాద్, శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

భద్రాచలంటౌన్: పేద, బుడుగు బలహీన వర్గాల అభివృద్ధి బీజేపీలోనే సాధ్యమని జాతీయ మీడియా కోఆర్డినేటర్ కేవీ రంగా కిరణ్ అన్నారు. భద్రాచలం పట్టణంలో బీజేపీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పల్లెపల్లెకు ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చింతలచెరువు శ్రీనివాస్, రామ్మోహన్‌రావు, వెంకన్న, కేశవ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుదర్శన్, ముక్తేశ్వరరావు, సత్యనారాయణ, జయరాజు, నారాయణ, సుబ్బారావు, గణేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై దాడి

బూర్గంపాడు: మండలంలోని సారపాక తాళ్లగొమ్మూరుకు చెందిన బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు చలకోటి పూర్ణచందర్‌రావుపై మంగళవారం రాత్రి దాడి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లగొమ్మూరుకు సమీపాన గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారాన్ని పూర్ణచందర్‌రావు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. దీంతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఉదయ్, రామకృష్ణ, అనిల్, శిరీష్ పథకం ప్రకారం పూర్ణచందర్‌రావుపై దాడికి చేయగా, ఆయనను కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి తండ్రి బలరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వాగొడ్డుగూడెం సమీపాన మంగళవారం అర్ధరాత్రి సమయంలో రామన్నగూడెం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనానికి అడ్డొచ్చిన వృద్ధుడు గొత్తుల భాస్కర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో భాస్కర్‌తో పాటు వాహనం నడుపుతున్న రామన్నగూడేనికి చెందిన కుంజా సోమరాజుకు గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోర్టుకు బెంచీల వితరణ

మణుగూరురూరల్: మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టుకు సామాజిక సేవకుడు బుద్దరాజు నవీన్‌బాబు మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు సమక్షంలో బుధవారం ఐదు బెంచీలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.శ్రీనివాసరావు, కె.నర్సింహారావు, వెంకట్, నాగార్జున, సావిత్రి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే చెల్లింపులు

చర్ల: గోదావరి వరదల సందర్భంలో సహాయక చర్యలకుగాను చర్ల మండలంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో వ్యాపారుల వద్ద చేసిన అప్పులు తిరిగి చెల్లించడం సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పోరాట ఫలితమేనని ఆ పార్టీ చర్ల మండల కార్యదర్శి కొండా చరణ్ అన్నారు. బుధవారం చర్లలోని డీవీకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి వరదల సందర్భంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ యంత్రాంగం వివిధ వర్గాల నుంచి రూ.61 లక్షల రూపాయల మేర అప్పుగా తీసుకొని సహాయక చర్యలు చేపట్టిందని, తిరిగి చెల్లింపు జాప్యం చేయడంతో ప్రజాపంథా పలు దఫాలుగా పోరాటం చేసిందని అన్నారు. ఈ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం రూ.31 లక్షలను విడుదల చేసిందని ఆయన అన్నారు. మిగిలిన సొమ్మును కూడా త్వరితగతిన విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు మునిగెల శివ, కొక్కిరపాటి రవి, కనితి భాను ప్రకాశ్, సుజాత పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన



మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: మండలంలోని రాజీవ్‌గాంధీనగర్‌లో సుమారు రూ.4.50కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ పనులను బుధవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పరిశీలించారు. నిర్మాణ పనులను పురోగతి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల వసతులతో సువిశాలమైన భవనాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహరావు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలో విస్తృత పర్యటన

మణుగూరు పట్టణంలో పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే రేగా కాంతారావు బుధవారం విస్తృతంగా పర్యటించారు. వీధి వీధినా తిరుగుతూ ప్రజల ఇబ్బందులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆయన దృష్టికి రాగా.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే మణుగూరు మున్సిపాలిటి రూపురేఖలు మారనున్నాయని, ప్రతీ వార్డులో డ్రెయినేజీలు, రోడ్లు వంటి నిర్మాణాలతో అభివృద్ధి చెందనున్నాయని తెలిపారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

పినపాక: అంబేద్కర్ ఆశయ సాధనకు తన వంతు కృషి చేస్తానని, అంబేద్కర్ అడుగుజాడలే ప్రభుత్వ విధానమని ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండలంలోని ఉప్పాక గ్రామంలో అంబేద్కర్ యువజన సమైక్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. ఎంపీపీ గుమ్మడి గాంధీ, మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, ఎస్సీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని రికార్డులు సృష్టించాలి



కార్మికులను అభినందిస్తున్న జీఎం దుర్గం రాంచందర్

మణుగూరుటౌన్: బొగ్గు ఉత్పత్తి, రవాణాలో మణుగూరు ఏరియా పీకేఓసీ 2022–23 సంవత్సరంలో సరికొత్త రికార్డు సృష్టించిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం పీకేఓసీ ప్రాంగణంలో కార్మికులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన వార్షిక లక్ష్యం 96లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికిగాను 97.5 లక్షల టన్నులు సాధించడం ఒక ఎత్తైతే... ఒకే సంవత్సరంలో 104.05లక్షల టన్నులు బొగ్గును డిస్పాచ్ చేసి ఒకే గని ద్వారా అత్యధిక బొగ్గు రవాణా చేసిన గనిగా యావత్ సింగరేణిలో సరికొత్త రికార్డు సృష్టించడం మరో ఎత్తని అన్నారు. భవిష్యత్‌లోను పీకేఓసీ మరెన్నో రికార్డులు సాధించేందుకుగాను అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులు కృషి చేయాలన్నారు. అనంతరం పీకేఓసీ ప్రాజెక్టు అధికారి టి.లక్ష్మీపతిగౌడ్ మాట్లాడారు. కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. సామూహిక రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీకేఓసీ ప్రాజెక్టు మేనేజర్ మాలోత్ రాముడు, ఏరియా గుర్తింపు సంఘం నాయకుడు వి.ప్రభాకర్‌రావు, ప్రాజెక్టు ఇంజనీర్ వీరభద్రుడు, ఓసీ–2 ఎస్‌ఓఎం దండమూడి రాంబాబు, ఓసీ–4 మేనేజర్ శ్రీనివాసరావు, శంకర్, నరసింహారావు, బాంగ్యా, టీబీజీకేఎస్ నాయకుడు అశోక్, శంకర్, సూపర్ వైజర్లు కార్మికులు అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా విజయవంతం

మణుగూరుటౌన్: ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ తెలిపారు. బుధవారం మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన జాబ్, అప్రెంటీస్ మేళా విజయవంతమైంది. సుమారు మణుగూరు, అశ్వాపురం, పినపాక మండలాలకు చెందిన సుమారు 150 మంది నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసుకుని ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు, ఉపాధి, అప్రెంటీస్ చేసుకోవడానికి నియమకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఐటీఐ పూర్తిచేసిన యువత అప్రెంటీస్ పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు ఐటీఐ టీఓ జి.రవి, వివిధ కంపెనీల హెచ్ ఆర్‌లు, ప్రతినిధులు హాజరయ్యారు.

సంత మార్కెట్ సందర్శన



సంతలో వ్యాపారితో మాట్లాడుతున్న కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా బుధవారం భద్రాచలం రోడ్‌లో నిర్వహిస్తున్న సంత మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేరుగా వ్యాపారులు, వినియోగదారులతో మాట్లాడారు. సంతలో జరిగే క్రయ, విక్రయాలు, నిత్యావసరాల విక్రయాలు, వాటిని విక్రయంచే విధానం, అధికంగా అమ్మే సరుకుల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రొఫెసర్ కృష్ణతేజ మాట్లాడారు.

20న ఇఫ్తార్ విందు

మణుగూరుటౌన్: ఈ నెల 20న పినపాక నియోజకవర్గంలోని ముస్లిం సహోదరులకు ఇఫ్తర్ విందు ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. బుధవారం సింగరేణి అతిథి గృహంలో మణుగూరు మండల ముస్లిం పెద్దలు, బీఆర్‌ఎస్ ముస్లిం మైనార్టీ సెల్ నాయకులు పలువురు ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మైనార్టీల సంక్షేమానికి అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి మరువలేనిదని ఈ సందర్భంగా తెలిపారు. జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, మణుగూరు మండల ముస్లిం సహోదరులు జావీద్, ఎండి.యూసఫ్ షరీఫ్, బాబుజానీ, ఇస్మాయిల్, నూరుద్దీన్‌లు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలి

అశ్వాపురం: తక్షణమే తమను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరారు. నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ కాలం పూర్తి అయిన సందర్భంగా మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుక జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం చెప్పిన విధంగా అన్ని పనులు చేసి తెలంగాణను పల్లె ప్రగతిలో అగ్రగామిగా నిలబెట్టామన్నారు. ఉపాధి హామీ పనులు, కరోనా సమయంలో విధులు, గోదావరి వరదలు, బీఎల్‌ఓ, పోడు సర్వే వంటి ఎవరూ చేయని విధంగా చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు తౌఫిక్, అనూష, వేణుప్రియ, పూజ, వనజ, కిరణ్మయి, శ్రావల్య, దినేష్, హుస్సేన్, సైదులు, కృష్ణచైతన్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించడమే నివాళి



భద్రాచలంఅర్బన్: కుంజా బొజ్జి వర్ధంతి సభలో మాట్లాడుతున్న మిడియం బాబురావు

భద్రాచలంఅర్బన్: మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ప్రజల మధ్య అంతరాలు పెంచుతున్న బీజేపీ నేతత్వంలోని నరేంద్ర మోదీని గద్దె దించడమే కుంజా బొజ్జికి తామిచ్చే ఘన నివాళి అని సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజె.రమేష్‌లు అన్నారు. బొజ్జి ద్వితీయ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన బుధవారం రాజుపేటలో జరిగింది. ముందుగా బొజ్జి స్మారక స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని బాబురావు ఆవిష్కరించారు. చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.బ్రహ్మచారి, ఎంబి.నర్సారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, ఎం.రేణుక, సున్నం గంగా, పార్టీ సీనియర్ నాయకులు జీఎస్ శంకర్‌రావు, తిలక్, లైన్స్‌క్లబ్ బాధ్యులు పల్లంటి దేశప్ప, పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు బండారు శరత్ బాబు, బి.వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్ల: భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గానికి సీపీఎం తరుపున మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఏజెన్సీ ప్రజల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఆదర్శ ప్రాయుడు కుంజా బొజ్జి అని సీపీఎం మండల కార్యదర్శి కారం నరేష్ అన్నారు. కుంజా బొజ్జి వర్ధంతిని బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరగగా.. పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు మాట్లాడారు. సీపీఎం నాయకులు మచ్చా రామారావు, బందెల చంటి, శ్యామల వెంకట్, పామారు బాలాజీ, వందే మూర్తి, పొడుపుగంటి సమ్మక్క, వరలక్ష్మి, శ్రీకళ, షారోను తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు నేతృత్వంలో కుంజా బొజ్జి వర్ధంతి సభను బుధవారం బూర్గంపాడులో నిర్వహించారు. కుంజా బొజ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, బర్ల తిరుపతయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: టీఏజీఎస్ మండల కార్యదర్శి తోడం తిరుపతిరావు ఆధ్వర్యంలో మండలంలోని మారాయిగూడెం గ్రామంలో దివంగత మాజీ ఎమ్మెల్యే కుంజా బుజ్జి రెండో వర్ధంతి సభను నిర్వహించారు. కార్యక్రమంలో కారం రాంబాబు, ధల్లి కోటి, సోయం జంపన్న, సోంది వీరస్వామి, రమేష్, జోగయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.